క్లుప్తంగా

మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలికి చేయూత



ఆత్మకూరు: మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న విమలమ్మకు డాక్టర్ ప్రణీత్ బుధవారం చేయూతనందించారు. విమలమ్మ రెండు నెలల క్రితం జారిపడి గాయపడింది. అప్పట్నుంచి ఆమె మంచానికే పరిమితమవడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ప్రణీత్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నగదు సాయంతో పాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, అశోక్, రహీం, నాయబ్, షరీఫ్, యాసిన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ఆత్మకూరు: పట్టణంలోని అభిరామ్ ఆస్పత్రి లో అభిరామ్ మెడికల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.నోవా బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో అభిరామ్ ఆస్పత్రి ఎండీ కేవీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో సాగిన శిబిరంలో రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 1800 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన స్వయంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

సోమశిల: అనంతసాగరంలో 50 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మన్యం మహేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించగా 50 క్వార్టర్ బాటిళ్లు పట్టుబడ్డాయని చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఈఓపీఆర్డీకి సన్మానం



ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ గుంటూరు జిల్లా చేబ్రోలుకు బదిలీపై వెళ్తున్న టీ ఉషారాణిని సహచర సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ ఉషారాణి సేవలను కొనియాడారు. ఏఓ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్లు మనోహర్‌రెడ్డి, ప్రసాద్, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పల్లవోలు భాస్కర్, బొటిక నరసింహులు, ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఉదయగిరి: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ఆటోలు, మినీ వ్యాన్లను నడుపుకోవాలని డ్రైవర్లకు సీఐ వెంకట్రావు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆటోలు, మినీవ్యాన్‌ల డ్రైవర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపైనే వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నట్లుగా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన, డ్రైవింగ్ లైసెన్సులను వెంట ఉంచుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నందున గురువారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఖుద్దూస్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సోమశిల: 33కేవీ విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా అనంతసాగరం మండలం సోమశిల పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మురళీకృష్ణ బుధవారం తెలిపారు.

మహాకరుణ శాకాహార ర్యాలీ

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మహాకరుణ మెగా శాకాహార ర్యాలీని బుధవారం నిర్వహించారు. ప్రముఖ పిరమిడ్ ధ్యాన మాస్టర్లు లగడపాటి గాంధీ, కట్టా కళాధర్‌రెడ్డి, జేజీ నారాయణ, జే శ్రీనివాస్, తదితరులు శాకాహారం ప్రయోజనాలను వివరించారు. స్థానిక పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లునాయుడు పర్యవేక్షించారు.

గాంధీ మార్గం అనుసరణీయం

భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో బాపూజీకి ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలను స్మరించుకున్నారు.



కావలి: మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి నివాసంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో గాంధీ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యాగ్రహం, అహింసను ఆయుధాలుగా చేసుకుని గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించారని, ఆయన చూపిన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, షేక్‌నాయబ్ రసూల్, కుందుర్తి శ్రీనివాసులు, గుడ్లూరు మాల్యాద్రి, కనపర్తి రాజశేఖర్, అక్కిలిగుంట మాల్యాద్రి, పరుసు మాల్యాద్రి, పేరం వెంకటేశ్వర్లు, ఆత్మకూరు రాజేస్, కలికిక శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో రెడ్‌క్రాస్ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత గాంధీ

దేశంలో రెడ్‌క్రాస్ ఉద్యమ ప్రారంభానికి స్ఫూర్తి ప్రదాత గాంధీ అని కావలి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు కన్వీనర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఆవరణంలోని గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. దక్షిణాఫ్రికాలో జరిగిన బోయర్ యుద్ధంలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించిన రెడ్‌క్రాస్ బృందానికి నాయకత్వం వహించిన గాంధీ స్ఫూర్తితోనే దేశంలో 1920లో పార్లమెంట్ యాక్ట్ ద్వారా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని తెలిపారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు పూనూరు మురళీధర్‌రెడ్డి, జమున, స్వర్ణలత, ప్రసాద్, కలికి సాయిపవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న జెమ్స్ చిల్డ్రన్స్ హోంలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొని గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ శశిరేఖ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ సాగించిన పోరాటాలను స్మరించుకున్నారు. మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో జాతిపిత గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, బాలఅంకయ్య, పీ వెంగళరెడ్డి, నందవరం ప్రసాద్, ప్రతాప్, జమ్రు, జయపాల్‌రెడ్డి, నరేంద్ర, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

• ఆత్మకూరు రవాణా శాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాములు, ఇరిగేషన్ కార్యాలయంలో ఈఈ వెంకటేశ్వర్లు మహాత్ముని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

• పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ నాయకులు హరికృష్ణ, శ్రీరాములు, వై రమణయ్య, సుధాకర్ రావు, ఎ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

• పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నం నాగరాజు, సభ్యులు సయ్యద్ రసూల్, ఇస్మాయిల్, ఆరీఫ్, మహేష్, తదితరులు ఉన్నారు.

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, తదితరులు జాతిపితకు నివాళులర్పించారు.



అల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో..



కావలి: రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో..



మర్రిపాడు పోలీసు స్టేషన్‌లో..



ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే మేకపాటి కార్యాలయంలో..

మర్రిపాడు: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సురేంద్ర, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాసరావు, పీహెచ్‌సీలో డాక్టర్ గోపినాథ్ జాతిపితకు నివాళులర్పించారు.

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ జీవిత విశేషాలను స్మరించుకున్నారు. పోలీసుస్టేషన్‌లో ఎస్సై సైదులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాసులు, సీనియర్ సహాయకులు మనోహర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంగం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నారెడ్డిపాళెంలోని గాంధీజీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెండాదిబ్బలో వైద్యశిబిరం నిర్వహించారు. పడమటిపాళెంలో గాంధీ చిత్రపటానికి ఎంఈఓలు జానకీరామయ్య, మల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు.

చేజర్ల: మండల తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి డీటీ మస్తానయ్య, చేజర్ల బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు బీ వీరరాఘవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు రేవతి సుబ్బారావు, పువ్వాడ సుబ్బరావు, పువ్వాడ శ్రీనివాసులు, సుధాకర్, బాబు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు. ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ శైలజాకుమారి, వైస్‌ప్రిన్సిపల్ నాగలలిత ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గాంధీ వేషధారణతో ఓ విద్యార్థిని ఆకట్టుకుంది.

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్ముని విగ్రహానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. వింజమూరు ఆర్యవైశ్య సంఘ నాయకులు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

• ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరాజు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయగిరి ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

జలదంకి: జాతిపిత మహాత్మ గాంధీ ఆశయాలు ఆదర్శనీయమని ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖరి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ శ్యామల, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు: వరికుంటపాడు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సికిందర్, తూర్పురొంపిదొడ్ల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీ పాత్రను స్మరించుకున్నారు.



కావలి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో..



ఆదూరుపల్లి గురుకులంలో గాంధీ వేషధారణతో రాట్నం వడుకుతున్న విద్యార్థిని



సంగం: పడమటిపాళెం పాఠశాలలో..



ఏఎస్‌పేటలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ జీ పద్మజారెడ్డి



వరికుంటపాడు మండలం తూర్పురొంపిదొడ్లలో..



ఉదయగిరి:వింజమూరులో గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత చిత్రపటానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవీరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెమళ్లదిన్నెలోని గాంధీ విగ్రహానికి సర్పంచ్ రామచంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ జ్యోతి, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు బొగ్గవరపు రత్నం, పంచాయతీ కార్యదర్శి జీవన్, తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురం మండలం నెమళ్లదిన్నెలో..



ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో..



ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో..



సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో..



ఆత్మకూరు ఎంవీఐ కార్యాలయంలో..

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

కావలి : కావలి సబ్‌జైలులో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధ వారం నిర్వహించారు. అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జీ విక్రమ్ సింహ ముఖ్యఅతిథిగా హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశంలో తప్పులు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. తొలుత గాంధీ జయంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, న్యాయవాదులు కెనడి, కే మనోజ్ఞ, లోక్‌అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, జైలు సూపరింటెండెంట్ చిన్నసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్

గాంధీ జయంతి సందర్భంగా కావలి కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి కోర్టు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ సుధాకర్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీ విక్రమ్‌సింహ, కావలి బార్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రరెడ్డి, జయజయ ప్రకాష్, న్యాయ వాదులు శేషప్రసాద్, కెనడీ, వై వెంకటేశ్వర్లు, ఐ సాయిప్రసాద్, పీఎస్ మూర్తి, ఎస్ఎస్ కిరణ్, వీఎల్ఎన్ రెడ్డి, సురేష్ , వై అరుణ్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జడ్జి విక్రమ్‌సింహ

ఆ కార్యదర్శిపై పచ్చప్రేమ

- బదిలీ చేసిన గంటల్లోనే ఉత్తర్వులు వెనక్కి
- వివాదాస్పదంగా మారిన పంచాయతీ కార్యదర్శి బదిలీ
- తొలుత వరికుంటపాడు.. ఆ వెంటనే తిరిగి బోగోలుకు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ కార్యదర్శి బదిలీ వ్యవహారం దుమారం రేపుతోంది. టీడీపీ నేతల అండతో గంటల వ్యవధిలోనే బదిలీ ఉత్తర్వులను తారుమారు చేసి పాత స్థానంలోనే కొనసాగేలా మార్పు ఉత్తర్వులు తెచ్చుకోవడం జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల్లో చర్చనీయాంశంగా మారింది. బదిలీ ఉత్తర్వులు సోషల్ మీడియాలోనూ రచ్చగా మారడం గమనార్హం. జువ్వలదిన్నె పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జహీర్ డిప్యుటేషన్‌పై బోగోలు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఏడాదికి సుమారు రూ.33 లక్షలకు పైగా ఆదాయం వచ్చే మేజర్ పంచాయతీకి గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శి అయిన అబ్దుల్ జహీర్‌ను డిప్యూటేషన్‌పై నియమించడంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. సాంకేతికంగా బోగోలు మేజర్ పంచాయతీ గ్రేడ్-2 కేటగిరీలోనే ఉన్నా మండల కేంద్రం కావడం, పంచాయతీ జనాభా, ఆదాయం ప్రాతిపదికన ఇక్కడ గ్రేడ్-1 కార్యదర్శి విధులు నిర్వహించాల్సి ఉంది. పంచాయతీ ఆదాయ వనరులు, జనాభా, తదితరాలను పరిగణనలోకి తీసుకోకుండానే అబ్దుల్ జహీర్‌ను డిప్యుటేషన్‌పై బోగోలుకు కేటాయించడాన్ని అప్పట్లోనే స్థానిక సంస్థల ప్రతినిధులు వ్యతిరేకించారు. అయినా టీడీపీ నాయకుల ఒత్తిడితో అధికారులు నిబంధనలు, క్షేత్ర పరిస్థితులను పక్కన పెట్టి జహీర్‌కు బోగోలు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి బోగోలు కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన ఇటీవల వైఎస్సార్‌సీపీకి చెందిన వార్డు సభ్యులపై పోలీసు కేసు సైతం పెట్టి వివాదాస్పదంగా మారాడు.

గంటల వ్యధిలోనే ఉత్తర్వులు మార్పు

ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా డిప్యుటేషన్‌పై బోగోలు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జహీర్‌ను వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లెకు బదిలీ చేస్తూ గత నెల 22వ తేదీన అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గంటల వ్యవధిలోనే తిరిగి బోగోలుకు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ రెండు ఉత్తర్వులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



తొలుత వరికుంటపాడుకు బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు




తిరిగి బోగోలుకు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

జాతీయ కరాటే పోటీలకు కచేరిదేవరాయపల్లి విద్యార్థిని



సోమశిల: అనంతసాగరం మండలం కచేరిదేవరాయపల్లికి చెందిన వీఆర్ఏ బండి రామ య్య కుమార్తె తనూజ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. ఆత్మకూరులోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న తనూజ ఇటీవల రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కరాటే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో ఢిల్లీలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు కరాటే మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా తనూజను గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కటౌట్

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, జ్వాలాముఖి ఆలయాలు, కాశీనాయన ఆశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆయా ఆలయాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించి భారీ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. తొలిరోజు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు భక్తులను అనుగ్రహించనుంది. కన్యకాపరమేశ్వరి ఆలయంలో కలశ స్థాపన, ప్రత్యేక పూజలు, భువనేశ్వరి అలంకారం నిర్వహించనున్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ పరిధిలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను విజవంతం చేసిన కార్మికులు, అధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అభినందించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సివిల్ జడ్జి ఎల్ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలోని వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టీ చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు దగుమాటి శివకోటారెడ్డి, గౌస్‌బాషా, సూరా భాస్కర్‌రెడ్డి, రమాదేవి, గంధళ్ల వేణు, శ్రీనివాసులు నాయుడు, మెప్మా సిబ్బంది సీఓ మాధవి, మున్సిపల్ ఏఈలు వరలక్ష్మి, ప్రసాద్, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వాగాల శ్రీహరి, ఆర్పీలు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న అధికారులు

గ్రామసభల్లో ఉపాధి పనుల గుర్తింపు

ఆత్మకూరురూరల్: ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామసభల ద్వారా గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించి చేపట్టాలని డ్వామా పీడీ గంగా భవానీ సూచించారు. కరటంపాడు సచివాలయం వద్ద సర్పంచ్ పూనుగుంట రేవతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. రైతులు, రైతు కూలీలకు ఉపయోగపడేలా పండ్లు, పూల తోటలు, ఫారంపాండ్స్, పొలం గట్ల వెంబడి చెట్ల పెంపకం, రైతుల పొలాలకు మట్టి తోలకం, తదితర పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టులు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, తదితరాలను చేపట్టవచ్చని వివరించారు. తొలుత గాంధీ జయంతి సందర్భంగా జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధి ఏపీఓ శిరీషారెడ్డి, ఈఓపీఆర్డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి బొటిక నరసింహులు, ఫీల్డ్‌అసిస్టెంట్ బాబు, స్థానిక నాయకుడు పెంచలరావు, తదితరులు పాల్గొన్నారు.



గాంధీకి నివాళులర్పిస్తున్న పీడీ గంగా భవానీ

20 తారు డబ్బాల చోరీ

కావలి: మండలంలోని రుద్రకోటలో ఉన్న తారు మిక్సింగ్ ప్లాంట్‌లోని 20 తారు డబ్బాలు చోరీకి గురైనట్లు బాధితుడు దశరథరామిరెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటి విలువ సుమారు రూ.2.40 లక్షలుగా ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.